# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

గురువారం 15 మే 2025


# సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

### కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి



**కరీంనగర్, మే14(నినాదం న్యూస్):** వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఈమధ్య కాలంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి అన్నారు. సెల్ ఫోన్లో వస్తున్న వివిధ రకాల మెసేజ్ లను గుడ్డిగా నమ్మి తెరవకూడదని సూచించారు. జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ఆలం రూరల్, రూరల్ ఏసిపి శుభం శుక్లా నగ్రాలా ఆదేశాల మేరకు బుధవారం నాడు కొత్తపల్లి మండలం రేకుర్తి లో గల లయోలా కాలేజీ ఆవరణలో దేశ సైన్యం, వివిధ రక్షణ విభాగాల్లో ఉద్యోగాల ఎంపిక కోసం శిక్షణ పొందుతున్న యువకులతో కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం - దుష్పరిణామాలు అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ,వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ కష్టార్జితంతో సంపాదించి బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులను తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు పలు రకాల ఎత్తుగడలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తు న్నారని తెలిపారు. అనునిత్యం అప్రమత్తత అవగాహన కలిగి ఉండటాన్ని ఆయుధంగా మలుచుకోవాలని చెప్పారు. తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని, చట్టపరంగా డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని స్పష్టం చేశారు. వివిధ వర్గాల ప్రజలను మానసికంగా ఒత్తిరికి గురిచేసి డబ్బులను కాజేసేందుకు సైబర్ నేరగాళ్ళు పాల్పడుతున్న చర్యలని గుర్తించాలని చెప్పారు. సెల్ ఫోన్, ఏ టి యం, క్రెడిట్ కార్డులకు సాధారణ పాస్ వర్డ్ లను వినియోగించకూడదని, తమకు మాత్రమే పరిమితం కాబడిన పాస్ వర్డ్ లను ఎంపిక చేసుకున్నట్లయితే ఎలాంటి మోసాలకు గురవ్వకుండా ఉంటారని తెలిపారు. బ్యాంకు ఖాతాల నుండి సైబర్ నేరగాళ్లు డబ్బులను తస్కరించినట్లయితే వెంటనే 1930 నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆకర్షణీయమైన ప్రకటనలను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకుని మోసగాళ్లు ఎత్తుగడలతో పన్నాగం పన్నుతున్నారని తెలిపారు. యువత మదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వివిధ రకాల మత్తులకు బానిసలై యువత చేజేతుల భవిష్యత్తును నిర్వీర్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తి, శిక్షణ విభాగం ఇన్చార్జి సతీష్ రెడ్డి లతో పాటుగా శిక్షణ పొందుతున్న 200 మంది యువకులు పాల్గొన్నారు.

### జమ్మికుంట సీఐ

# వరగంటి రవి బదిలీ

### నూతన సీఐగా ఎస్ రామకృష్ణ గౌడ్



**జమ్మికుంట, మే 14 (నినాదం న్యూస్)** జమ్మికుంట పట్టణ సిఐగా పనిచేస్తున్న వరగంటి రవిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీలలో భాగంగా జమ్మికుంట టౌన్ సిఐ గా పనిచేస్తున్న వరగంటి రవిని ఐజి కార్యాలయానికి అటాచ్ చేస్తూ అక్కడ పనిచేస్తున్న ఎస్ రామకృష్ణ గౌడ్ ను జమ్మికుంట పట్టణ సీఐ గా బదిలీ చేశారు. జమ్మికుంట సీఐ గా పని చేస్తున్న వరగంటి రవి గత 15 నెల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చారు. 15 నెలల కాలంలో వృత్తిరీత్యా కొన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల్లో అవేర్నెస్ కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందారు.

# 4లేబర్ కోడ్ లను రద్దు చేయాలి



**మహేశ్వరం, మే 14 (నినాదాలు న్యూస్)** 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి. దత్తు నాయక్ డిమాండ్ చేశారు బుధవారం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బీ. దత్తు నాయక్ డిమాండ్ చేశారు. ఈ కార్మిక సమస్యల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మె గోడ పోస్టర్లను నేడు తుక్కుగూడ పట్టణంలో పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీ దత్తు నాయక్ ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విచ్చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లోకి మార్చి కార్మికులకు హక్కులు లేకుండా చేయడానికి నిరసిస్తూ మే 20న సార్వత్రిక సమ్మెను అఖిల భారత కార్మిక సంఘాలు, మరియు ఫెడరేషన్ లు నిర్వహిస్తున్న సమ్మె నేపథ్యంలో ఆ సమ్మెలో కార్మికులు విస్తృతంగా పాల్గొని కోల్పోయిన చట్టాలను తిరిగి పొందడానికి జరిగే పోరాటంలో కార్మిక వర్గం విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు ఇతర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆయన విమర్శించారు. అధిక ధరలు ఉద్యోగ భద్రత లేకపోవడం చాలీచాలని జీతాలు కార్మికుల తీవ్రంగా కలచివేస్తుందని ఆయన అన్నారు ఇలాంటి పరిస్థితుల్లో జరిగే సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి దేవేంద్ర గౌడ్, కే రాజు, ఆటో యూనియన్ నాయకులు భాను రాములు, నరసింహ సురేష్,వైట్ క్లిప్ యూనియన్ జనరల్ సెక్రెటరీ యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ్ములపల్లి గ్రామపంచాయతీలో

# ఎంపీఓ విచారణ

**మల్టీపర్పస్ వర్కర్ల ఆన్లైన్ నమోదు అవకతవకలపై ఫిర్యాదు**

**పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తాము**

**ఇల్లందకుంట ఎంపీ ఓ రాజేశ్వరరావు**



**జమ్మికుంట,మే14(నినాదం న్యూస్):** ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్లు - పారిశుధ్య కార్మికుల వివరాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్ లైన్ లో తమ పేర్లు నమోదు చేయలేదని, తమకంటే జూనియర్లకు ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసి అవకతవకలకు పాల్పడినారని జిల్లా పంచాయతీరాజ్ అధికారికి మల్లేష్, కళ్యాణ్ పిర్యాదు చేశారు.. దానిలో భాగంగా ఇల్లందకుంట ఎంపీడీవో రాజేశ్వరరావు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు... దీంతో ఆన్ లైన్ లో పేరు నమోదు అయిన వారికి ఆన్లైన్లో నమోదు కానటువంటి కార్మికులకు వారి బంధుమిత్రులకు కలిసి పెద్ద ఘర్షణ జరిగింది.. దీంతో పోలీసులకు సమాచారం తెలియడంతో ఇల్లందకుంట ట్రైనీ ఎస్సై దీపక్ కుమార్ పోలీస్ సిబ్బంది హాజరై ఇరువర్గాలను సముదాయించి విచారణ పూర్తయ్యే విధంగా చొరవ తీసుకొని విచారణ చేపట్టారు.. విచారణలో ఫిర్యాదు చేసిన మల్లేశం టెంపరరీ కాంట్రాక్టు కింద గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని, కళ్యాణ్ అనే కార్మికుడు తన బాబాయి మృతి చెందగా అతని ప్లేస్ లో గత ఏడు నెలలుగా పనిచేస్తున్నాడని వీరిద్దరూ ఆన్ లైన్ లో నమోదు చేయడానికి అర్హులు కారని విచారణలో తేలినట్లు ఎంపీవో రాజేశ్వరరావు తెలిపారు.. విచారణలో తేలిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని మిగతా నిర్ణయం ఉన్నతాధికారులు తీసుకుంటారని తెలిపారు.

# రాజీవ్ యువ వికాసం పథకం ఎంపికకు సిబిల్ స్కోర్ తో సంబంధం లేదు

### టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎండి.అజీజ్ పాషా..పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్

హుజూర్ నగర్ మే 14 ( నినాదం న్యూస్): నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక సిబిల్ స్కోర్ ఆధారంగా జరుగుతుందని సోషల్ మీడియా చేస్తున్న ప్రచారం అవాస్తవం. అని ఆయన ఒక ప్రకటనలో అన్నారు రాష్ట్రంలో నిరుద్యోగులకు వరంగా రాజీవ్ యువ వికాసం..లిమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో జిల్లా ప్రజలకు తన సహకారంతో ఈనెల 15 నాటికి జిల్లా సెలక్షన్ కమిటీకి ,28 నాటికి శాంక్షన్ ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి నియోజకవర్గాల వారిగా శాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది అన్నారు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం అయినా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు రానీ నిరుద్యోగుల కోసమే దేశంలో ఎక్కడ లేని విధంగా 9వేల కోట్ల రూపాయలతో నిరుద్యోగ యువత



స్వయం శక్తితో ఎదిగేలా రాజీవ్ యువ వికాసం పథకం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది అని అన్నారు యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకేరాజీవ్ యువ వికాసం పథకం. లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్ తో సంబంధం లేదు. సిబిల్ స్కోర్ కావాలంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. సిబిల్ స్కోర్, ట్రాక్ రికార్డు, రికవరీ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోరు అని అన్నారు గత నాలుగేళ్లుగా ఎస్సీ ఇతర కార్పొరేషన్ల లోన్లు తీసుకునే వారికి కాకుండా కొత్తవారికి రుణాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మెట సుబ్బరాజు, ఎడవల్లి వీరబాబు,పాశం రామరాజు, చెన్నం శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం




**మంచిర్యాల ప్రతినిధి, మే 14(నినాదం న్యూస్ )** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని తిప్పి కొట్టాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఎస్ఆర్పి 3 గనిలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్ లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్లుగా మార్చడానికి వ్యతిరేకిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగంగా సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని జోడిస్తూ ఒక్కరోజు టోకెన్ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం వలన కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని దేశ రక్షణ రంగంలో అమలవుతున్న అగ్నివీర్ పద్ధతిలో ప్రభుత్వ రంగ సంస్థలలో టైం బాండ్ తో ఉద్యోగాలు ఉంటాయని, గతంలో మాదిరిగా సింగరేణి కార్మికులకు వేజ్ బోర్డు ద్వారా జీతాలు పెంచుకునే అవకాశం లేకుండా కార్మిక సంఘాలు మరియు యాజమాన్యాలతో సాంప్రదింపులు లేకుండానే యాజమాన్యమే జీతాలు నిర్ణయించే ప్రమాదం ఉందన్నారు , ఈ నాలుగు కోడ్లు అమలు అయితే గ్రాట్యుటీ బోనస్ పెన్షన్ చట్టాలు ఉండవన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా కనీస వేతనాలు అమలు చేయకుండా 178 రూపాయల కంటే తక్కువ చెల్లించకుండా యాజమాన్యాలకు అనుకూలంగా ఈ కోడ్లను రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కొరకై చేసే సమ్మెను సైతం చేయకుండా ఈ చట్టాలను రూపొందించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తదితర సమస్యలపై సమ్మె చేయడం జరుగుతుందని కాబట్టి సింగరేణిలో కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, మష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, మురళి చౌదరి, ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని కుమారస్వామి, తిరుపతి రాజు, సిఐటియు నాయకులు నాగరాజు గోపాల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మణ్, ఫిట్ కార్యదర్శి సాదుల భాస్కర్, ఐ ఎఫ్ టి యు నాయకులు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొని అడవి గేదె మృతి



**మణుగూరు మే 14 (నినాదం న్యూస్):** సికింద్రాబాద్ టు మణుగూరు వైపు వస్తున్న సూపర్ ఫాస్ట్ రైలు అశ్వాపురం మండలంలో పాండురంగాపురం దాటిన తర్వాత అడవుల్లో అడవి గేద రైలు పట్టాలను దాటుతున్న సమయంలో సూపర్ ఫాస్ట్ ట్రైన్ ఢీకొని అడవి గేదఅక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. విషయాన్ని రైల్వే అధికారులు గమనించి స్థానిక అడివిశాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. అడవి శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గేదెను పరిశీలించి వివరాలు సేకరించారు. అడవి గేద బరువు సుమారు ఐదు క్వింటాళ్ల బరువు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. సంఘటన స్థలానికి ఫారెస్ట్ జిల్లా అధికారులు సైతం వచ్చి పంచనామను నిర్వహించారు. అనంతరం అడవి గేదెను ఖననం చేశారు.

# అంతర్గత పోరుతో కమలం వికసించేనా..?

### నియోజకవర్గంలో ఈటెల ను విమర్శిస్తే స్పందించరా..?

### కాంగ్రెస్ కౌంటర్ కు స్పందించని బిజెపి నేతలు..

### ఇదెక్కడి పద్ధతి అంటున్న ఈటెల రాజేందర్ వర్గం...

### అంతర్గతంగా చర్చించుకుంటున్న బిజెపి శ్రేణులు....

**జమ్మికుంట, మే 14 (నినాదం న్యూస్) :** మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు బిజెపి జాతీయ నాయకులు మాజీ మంత్రి ఈటల రాజేందర్ పై హుజురాబాద్ నియోజకవర్గం లో కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశాల ద్వారా పలు విమర్శలు చేస్తూ హెచ్చరికలు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ శాసనసభ్యులు జగ్గారెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మధ్య జరిగిన సంభాషణపై హుజురాబాద్ నియోజకవర్గం లో ఈటెల దిష్టిబొమ్మ దహనాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేయగా ఈటెలన విమర్శిస్తే సహించేది లేదు అంటూ జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ స్పందిస్తూ ఈటల రాజేందర్ కు అనుకూలంగా మీడియాకు ప్రెస్ నోట్ విడుదల చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం లో మంచి గుర్తింపు ఉన్న నేతగా పేరు ఉన్న ఈటల రాజేందర్ ను కాంగ్రెస్ నేతలు విమర్శిస్తే స్థానిక బిజెపి నేతలు కనీసం ఖండించక పోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత కొద్ది రోజులుగా బిజెపి పార్టీలో వర్గ విభేదాలు ఉన్నప్పటికీ ఈటెల రాజేందర్ పై అంతర్గతంగా ప్రతి బిజెపి కార్యకర్తకు అభిమానం ఉందన్న మాట వాస్తవం. కానీ మీడియా ముఖంగా ఈటలకు మద్దతు తెలిపితే మరొక వర్గం నుంచి వ్యతిరేకత వస్తుండడంతో స్థానిక బిజెపి నేతలు ఈటల కు మద్దతుగా మాట్లాడడానికి సంకోచిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపి అభ్యర్థులను గెలిపించడం లో ఈటెల రాజేందర్ ముందు వరుసలో ఉండి గెలిపించే సత్తా ఉన్న నాయకుడు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆయనకు పెద్ద నెట్వర్క్ ఉన్నది. కానీ కొంతమంది బీజేపీ వ్యక్తులు ఈటెల రాజేందర్ వర్గానికి సంబంధించిన వ్యక్తులను దూరంగా ఉంచుతూ పార్టీ కార్యక్రమాలకు సైతం వారిని ఆహ్వానించకుండా అవమానాలకు గురి చేస్తున్నప్పటికీ పార్టీ కోసం వారు పనిచేస్తున్నారు. ఎవరైనా కార్యకర్తలు నాయకులు ఈటెల రాజేందర్ తో సన్నిహితంగా ఉంటే వారికి పార్టీ పదవులు రాకుండా చేయడం పార్టీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సైతం పారిన దూరంగా పెట్టడం ఇక్కడ కొనసాగుతుంది. అయినప్పటికీ ఆయన సూచనలతో పార్టీ ఆశయాలను ముందుకు కొనసాగిస్తూ కలుపుకొని పోదామని అనుకున్నప్పటికీ ఇంకొక వర్గం లోని కొంతమంది నాయకులు వారికి సహకరించక పోవడంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. ఈటెల రాజేందర్ బిజెపిలోకి చేరకముందు హుజురాబాద్ నియోజకవర్గం లో కేవలం పట్టణాల్లో మాత్రమే ఆ పార్టీకి కార్యకర్తలు నాయకులు ఉండేవారు. ఉప ఎన్నికల సమయంలో బిజెపి పార్టీలో చేరిన ఈటల రాజేందర్ బిజెపి పార్టీపై గెలిచి గ్రామ గ్రామాన బిజెపి జెండా ను ఎగరవేసి కార్యకర్తలను తయారు చేశారు. ఈటెల రాజేంద్ర అభిమానులే బిజెపి కార్యకర్తలుగా చలామణి అవుతున్న సందర్భంలో మొదటి నుంచి బిజెపిలో ఉన్న కొంతమంది నాయకులు వీరిని కలుపుకుని పార్టీ పరిస్థితి రాబోయే రోజుల్లో అధ్వాన్నంగా మారే పరిస్థితి ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నాయకుల మధ్య ఉన్న విభేదాల కారణంగా కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలలో నియోజకవర్గంలో పార్టీ మరింత బల పడాలంటే ఖచ్చితంగా ఈటెల రాజేందర్ వర్గం సహకరిస్తే నే బిజెపికి మనుగడ ఉంటుంది. ఇప్పటికే నరేంద్ర మోడీ చరిష్మాతో నియోజకవర్గంలో బిజెపి పార్టీ బాగా పుంజుకున్నప్పటికీ స్థానిక నేతల రాజకీయాల తో కార్యకర్తల్లో అసహనం పెరుగుతుంది. ఇప్పటికైనా కలిసికట్టుగా పనిచేస్తేనే పార్టీకి భవిష్యత్తు ఉంటుందని లేకపోతే ఎవరి దారి వారు చూసుకోవాల్సి వస్తుందని స్థానిక బిజెపి నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీనిపై పార్టీ అధిష్టానం అందర్నీ పిలిచి మాట్లాడితే సమస్య సులభంగా పరిష్కారం అవుతుందని బిజెపి శ్రేణులు అంటున్నారు. నాయకుల మధ్య మేము నలిగిపోతున్నామని మేము ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నామని ఒకరికి మద్దతుగా మాట్లాడితే మరొకరు దూరంగా ఉంచుతున్నారని పార్టీలో ఎవరు చెబితే వినాలో అర్థం కాని పరిస్థితుల్లో స్థానిక నేతలు కార్యకర్తలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వేములవాడలో వ్యాపారులు,

# ప్రజలు స్వచ్ఛదంగా బంద్

**వేముల వాడ ఆలయం వివాదంపై బంద్ కు పిలుపు**

**అందరితో చర్చించండంటూ మంత్రి దిశానిర్దేశం**

**వేములవాడ::**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే శంకుస్థాపన చేసింది. పనులు కూడా ప్రారంభించింది. దాదాపు.. రెండేళ్ల వరకు కూడా భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం ఉండదు. అయితే.. పూజాలు, అభిషేకాలు మాత్రం జరుగుతుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో రాజన్న ఆలయం డెవ్ లప్ మెంట్ పనుల్ని స్వాగతిస్తునే.. మరోవైపు స్థానిక ప్రజలు, భక్తులు.. రెండేళ్ల పాటు స్వామి వారి దర్శనం కల్పించకుండా ఉండే నిర్ణయంను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. ఇది తమ మనోభావాలకు చెందిన అంశమన్నారు. ఈరోజు వేముల వాడ వ్యాప్తంగా వ్యాపారులు, భక్తులు, స్థానికులు బంద్ ను పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేముల వాడలో ఎక్కడికక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందో బస్తు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా.. వేముల వాడ వివాదంపై తాజాగా...మంత్రి కొండా సురేఖ రియాక్ట్ అయ్యారు. రాజన్న దేవాలయ కమిషనర్, ఈవో ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయం విస్తీర్ణం పెంపుపై అపోహాలపై చర్చించారు. కేవలం భక్తుల సౌకర్యం కోసమే.. ఆలయం విస్తీర్ణం పెంపును చేపట్టామని దేవాలయ అధికారులు స్పష్టం చేశారు. ఆలయం విస్తీర్ణంపై ప్రజల్లో ఉన్న అపోహల్ని తొలగించి, అన్ని వర్గాల ప్రజలతో చర్చించాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సుందరీమణుల రాకతో సుందరీకరణ

**-అందగత్తెల రాకతో 1000 మంది పోలీసుల బందోబస్తు**

**-అందగత్తెల పర్యటనతో హంగామా**

**-ప్రజా సమస్యలు గాలికి..అప్పుల రాష్ట్రంలో హంగామాలు.. ఆర్భాటాలు**

**-గాలి మోటార్లలో మంత్రుల పర్యటనలు**

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది మున్నూరు రవీందర్ ఆరోపణ**



**వనపర్తి ప్రతినిధి, మే 14 (నినాదం న్యూస్)** రాష్ట్రంలో ఒకపక్క ఆర్థిక సంక్షోభం..మరోపక్క నిలిచిపోయిన సంక్షేమ పథకాలు.. అభివృద్ధి పనులు.. ప్రజలు కటిక దారిద్రంతో జీవిస్తున్న తరుణం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలి రాష్ట్ర మం త్రులు గాలి మోటార్లలో తిరుగుతున్నారని, మరోపక్క ప్రభుత్వం 72వ మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా హంగామా, హార్భాటాలు చేస్తుందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది మున్నూరు రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి 17 నెలల సమయం గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా సంక్షేమ పథకానికి ఖర్చు చేయలేదని, ఎక్కడ ఒక అభివృద్ధి పని చేపట్టలేదని ఆయన ఆరోపించారు. అలాంటి ప్రభుత్వం ఇటీవల ఈ రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా ఉందని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొంతు కోసిన కూడా నేను ఏమి చేయలేను అంటూ చేతులెత్తి మాట్లాడడం అందరికి తెలిసిన విషయమని అన్నారు. అయినప్పటికీ 2025 మిస్ వరల్డ్ ప్రపంచ అందగత్తెలు, ప్రపం చంలోనే 120 దేశాల నుంచి సుందరిమణులు రాష్ట్రంలో పర్యటి స్తున్న నేపథ్యంలో ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, ఏర్పాట్లు దాదాపు 1000 మంది పోలీసులతో బందోబస్తు ఈ తెలంగాణ సాంప్రదా యానికి విరుద్ధంగా ఉందని ఆయన ఆరోపించారు. సాంప్రదా య భారత దేశంలో మహిళలను ఒక దేవతగా కేంద్ర ప్రభుత్వం భారతదేశ మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తూ కట్టు, బొట్టు కలిగిన ఈ దేశ మహిళలకు మిస్ వరల్డ్ ప్రపంచ అందగత్తెల పర్యటన అవమానాన్ని కలిగిచ్చే విధంగా ఉందని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపం మార్చిన ముఖ్యమంత్రి తెలంగాణ ఆడపడుచుల యొక్క గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా ఈ మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నారని అన్నా రు. ఈ నెల 16న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని దాదాపు పురాతనమైన 750 సంవత్సరాల చరిత్ర కలిగిన పిల్లలమర్రి కేంద్రాన్ని ప్రపంచ సుందరీమణులు దర్శించుకున్న సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న ఆర్భాటం పేద, బడుగు, బలహీ నవర్గాల సంక్షేమం కోసం ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. భారతమాత గౌరవాన్ని ప్రతిష్టను అవమానపరిచే విధంగా ఆడవాళ్లను ఆట బొమ్మలుగా చిత్రీకరించేందుకు కొన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి ఈ ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజ ల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందని అన్నారు. ప్రజాధనాన్ని దుర్విని యోగం చేయడానికి ఈ ప్రభుత్వం అనవసరమైన కార్యక్రమాల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీయడానికి కుట్ర చేస్తుందని అన్నారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేనప్పుడు రాష్ట్ర మంత్రులు ఏ చిన్న ప్రభుత్వ కార్యక్రమం జరిగిన గాలి మోటార్లలో ఎందుకు పర్యట స్తున్నారని ప్రశ్నిం చారు. హెలికాప్టర్ లేనిది రాష్ట్ర మంత్రులు బయటికి పర్యటించలేకపోతున్నారని, ఈ రాష్ట్రంలో సంక్షేమాన్ని విస్మరించి సంక్షోభంలో నెట్టడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపిం చారు. ఇప్పటివరకు ప్రజలకు ముఖ్యంగా రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ అందలేదని, తొందరలోనే వర్షాకాలం ప్రారం భమవుతున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ పంటకు సిద్ధమవుతు న్నారని, అలాంటి రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఇప్పించే కార్యక్రమం చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న సందర్భంగా రైతులు ఎంతో ఆశపడి వ్యవసాయానికి సిద్ధపడుతున్నారని, అలాంటి రైతుల కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్ట కుండా ఇటీవల అకాల వర్షాలు, ఈదురుగా లులతో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. ప్రజా సంక్షే మాన్ని గాలికి వదిలి ప్రభుత్వం టైంపాస్ పాలన కొనసాగిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణలో అవ సరం అనుకుంటే ప్రభుత్వం ప్రజల సమస్యలు కూడా ఎందుకు అవసరం లేదని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవాలని, తొందరలోనే వ్యవసాయ రంగం, మరోపక్క విద్యారంగం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు వసతులు, పుస్తకాలు, దుస్తులు, రైతులకు ఎరువులు, పంట రుణాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని, గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పట్టక తప్పదని మున్నూరు రవీందర్ హెచ్చరించారు.

# హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు ఎంపిక

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్



**కీసర ప్రతినిధి, మే 14, (నినాదం న్యూస్):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి నాగారంకు చెందిన నలుగురు ప్రతినిధులను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించినట్టు సంస్థ చైర్మన్ మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎం. శివకుమార్, జె. నరేష్ కుమార్, ఎం. సతీష్ కుమార్, ఎం. చిత్తారి రాజులను సంస్థలో కీలక పదవులకు నియమించడంపై స్పందించిన వారు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన చైర్మన్ మాధవ్ కి, మా నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరకొండ సతీష్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మానవ హక్కుల పరిరక్షణ కోసం మా శక్తి మేరకు పనిచేస్తాం. బాధితులకు అండగా నిలిచి, న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తాం అని తెలిపారు. సంస్థ అభివృద్ధికి సద్వ్యవస్థాపకతతో పనిచేస్తాం. హక్కులు భంగమవుతున్న ప్రతిసారి హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున గట్టిగా స్పందిస్తాం. మా నియామకం సామాజిక బాధ్యతను మరింత పెంచినట్లుంది అని వారు అన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.